నమస్తే తెలంగాణ

సంగారెడ్డి

I | హైదరాబాద్, గురువారం 1 ఆగస్టు 2024 | SANGAREDDY




కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి వద్ద చుక్క నీరు లేక వెలవెలబోతున్న డీ4 కెనాల్

# వెలవెలబోతున్న డీ4 కెనాల్

- జలకళ తప్పిన సిద్దిపేట జిల్లా కొండపాక మండలం సాగునీటి కాలువ
- కేసీఆర్ పాలనలో వ్యవసాయం పండుగ
- కాంగ్రెస్ పాలనలో దండుగ అంటున్న రైతులు

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 31 : దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం ఐనాపూర్ శివారులో తపాస్‌పల్లి రిజర్వాయర్ నిర్మించారు. కొండపాక మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేయాలని సంకల్పించిన తెలంగాణ తొలి సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కొండపాక మండలంలోని 11వేల ఎకరాలకు సాగునీరు అందించమే లక్ష్యంగా సమారు రూ.50 కోట్లు ఖర్చుచేసి డీ4కెనాల్ ఏర్పాటు చేయించారు. కొండపాక మండల కేంద్రంతో పాటు మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, సిరిసినగండ్ల, గిరాయిపల్లి, మర్పడగ, ఖమ్మంపల్లి, రాంపల్లి, దుద్దెడ, అంకిరెడ్డిపల్లి, బందారం మీదుగా సిద్దిపేట రూరల్ మండలంలోని మరి కొన్ని గ్రామాలకు సాగునీరు అందించేందుకు కృషి చేశారు. నాటి సీఎం కేసీఆర్ కృషి ఫలితంగా కొండపాక మండలంలోని ఎనిమిది గ్రామాలకు సాగునీరు అందింది కానీ నేడు నీళ్లు లేక డీ4 కెనాల్ వెలవెలబోతున్నది. చేర్యాలకు చెందిన కొంత మంది కాంగ్రెస్ నాయకులు డీ4 కెనాల్‌లో మట్టిపోసి కొండపాక మండలానికి నీళ్లు రాకుండా అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న భారత జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతుల ప్రశాంత్ రైతులతో కలిసి తన సొంత ఖర్చులతో కెనాల్‌లో మట్టిని తొలిగించడంతో పాటు కొండపాక మండల రైతులకు సాగునీరు అందించాలని నీటి పారుదలశాఖ అధికారులకు వినతి పత్రం అందజేసినా 'నేటికీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న చందంగా తయారైంది. సాగునీరు అందక నాడు సాగు చేసిన భూములు నేడు బీడుగా మారాయి.

### వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేశారు..



కొండపాక(కుకునూరుపల్లి), జూలై 31: గులాబీ అధినేత కేసీఆర్ డీ4 కెనాల్ నిర్మించి వ్యవసాయరంగాన్ని సస్యశ్యామలం చేయించారు. నీటికి కొదవ లేకుండా రైతులు పంటలు పండిస్తూ సంతోషంగా జీవనం కొనసాగించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేసింది. మొన్నటి దాకా ఎటు చూసినా పచ్చని పంటలతో విలసిల్లిన భూములు నేడు బీడుగా మారాయి. ప్రభుత్వం వెంటనే డీ4కెనాల్ ద్వారా కొండపాక మండల రైతాంగానికి సాగునీరు అందించాలి.

–సున్నం భాస్కర్, రైతు, తిమ్మారెడ్డిపల్లి, సిద్దిపేట జిల్లా

### సాగునీటిపై సర్కారు మొద్దునిద్ర



కొండపాక(కుకునూరుపల్లి), జూలై 31: వ్యవసాయరంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన ప్రభుత్వం సాగునీటిని అందించకుండా మొద్దునిద్ర పోతున్నది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు డీ4 కెనాల్ ద్వారా కొండపాక మండలంలోని అనేక గ్రామాలకు సాగునీరు అందింది. ఎండాకాలంలో కూడా చెరువులు మత్తడి పోశాయి. గిప్పుడు వానకాలంలో కూడా చెరువులో నీళ్లు లేవు. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని డీ4 కెనాల్ ద్వారా సాగునీరు అందించి రైతాంగాన్ని ఆదుకోవాలి.

– జిర్రా రాజు, రైతు, ఖమ్మంపల్లి, సిద్దిపేట జిల్లా



సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట–భూంపల్లి మండలం ఎనగుర్తి శివారులో బీడు పొలంలో మేస్తున్న మేకలు

### నీళ్లు లేక రెండెకరాలే సాగు చేస్తున్నా..



సిద్దిపేట, జూలై 31: నాకు నాలుగు ఎకరాల పొలం ఉన్నది. గతంలో రంగనాయకసాగర్ ద్వారా కుడి కాలువకు నీళ్లు వదలడంతో నాలుగు ఎకరాలు మొత్తం పారింది. ఎంత కరువు ఉన్నా కాలువ నీళ్లతో పొలం పారించుకున్నాం. ఇప్పుడు రంగనాయకసాగర్‌లో నీళ్లు లేక సగం పొలం బీడుగా మారింది. ప్రభుత్వం వెంటనే గోదావరి జలాలతో రంగనాయకసాగర్‌ను నింపి కాలువలకు నీటిని వదిలి రైతులను ఆదుకోవాలి.

- చింతల పరశురాములు, రైతు, గుర్రాల గొంది, సిద్దిపేట జిల్లా

### ఎడమ కాలువ నీళ్లే ఆధారం



సిద్దిపేట, జూలై 31: రంగనాయకసాగర్ ఎడమ కాలువ నీటి మీద ఆధారపడి ప్రతి సంవత్సరం నాటు వేసిది. నాకున్న ఎకరం 20 గుంటల పొలం మొత్తం పారేది. ఎడమ కాలువలో ఎప్పుడూ నీళ్లు ఉంటుండే. ఇప్పుడు రంగనాయక సాగర్ ప్రాజెక్టులోనే నీళ్లు లేవు. పొలాలు నాట్లు వేయడం ఆలస్యమవుతున్నది. కేసీఆర్ ప్రభుత్వం లాగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రంగనాయకసాగర్‌ను కాళేశ్వరం నీటితో నింపాలి. ఎడమ కాలువకు నీళ్లు వదిలితేనే పంటలు పండుతాయి. సాగునీటి కోసం రైతులను ఇబ్బంది పెట్టరాదు.

- శ్రీనివాస్, రైతు, చంద్లాపూర్, సిద్దిపేట జిల్లా

### కాలువలు పారడం లేదు



సిద్దిపేట, జూలై 31: రంగనాయకసాగర్ ఎడమ కాలువ నీళ్లు మా పొలానికి ఆధారం. ఇప్పుడు నీళ్లు లేక కాలువలు పారడం లేదు. గతంలో పొలం మొత్తం వరినాటువేశా. ఇప్పుడు నీళ్లు లేక బీడుగానే ఉన్నది. పొలం దున్నేందుకు ఇబ్బందిగా మారింది. వ్యవసాయం చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నా. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రంగనాయకసాగర్ నిండుకుండలా ఉండేది. అప్పటి లాగానే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నీళ్లు ఇవ్వాలి.

- మిద్దెల రమేశ్, రైతు, చంద్లాపూర్, సిద్దిపేట జిల్లా

### మల్లన్నసాగర్ నుంచి నీళ్లు వదలాలి



తొగుట, జూలై 31: సరైన వర్షాలు లేక భూగర్భ జలమట్టం తగ్గింది. బోర్లు తక్కువగా నీళ్లు పోస్తున్నాయి. చాలా మంది రైతులు వరినాట్లు వేయలేదు. మల్లన్నసాగర్ ప్రాజెక్టులోకి వెళ్లే కాలువ నుంచి చెరువు, కుంటల్లోకి ప్రభుత్వం నిటిని విడుదల చేస్తే చెక్‌డ్యామ్‌లు నిండి రైతులకు న్యాయం జరుగుతది. కాళేశ్వరం జలాలను వదిలేందుకు ప్రభుత్వం మందుకొచ్చి రైతులను ఆదుకోవాలి.

- పిట్ల స్వామి, కన్గల్, తొగుట మండలం, సిద్దిపేట జిల్లా

### కెనాల్‌కు నీళ్లు విడుదల చేయాలి



వర్గల్, జూలై 31: రామాయంపేట కెనాల్‌కు నీళ్లు విడుదల చేయాలి. గత సంవత్సరం ఈపాటికే నాట్లు దగ్గర పడేది. ఈయేడు కాలం సక్కగ కాకపాయే. చెరువులు, కుంటల్లో నీళ్లు పారడం లేదు. తలాపునే కొండపోచమ్మసాగర్ ఉన్నా కాల్వల్లో సుక్కనీళ్లు లేవు. వానకాలం వచ్చినా మొగులు సూసుడవుతున్నది.రామాయిపేట కాల్వల్లో నీళ్లలేక తుంగమొలుస్తున్నది. ప్రభుత్వం స్పందించి రైతులకోసం నీళ్లు విడుదల చేయాలి.

- కాగిరంగుల సుదర్శన్‌రెడ్డి, రైతు, సింగాయిపల్లి, వర్గల్ మండలం, సిద్దిపేట జిల్లా



సిద్దిపేట జిల్లాలో నీళ్లు లేక వెలవెల బోతున్న మల్లన్నసాగర్



సిద్దిపేట జిల్లా చంద్లాపూర్‌లో రంగనాయకసాగర్ ఎడమ కాలువ కింద నీళ్లు లేక బీడు పెట్టిన పొలం

# రైతులకు సాగునీటి కష్టాలు

## రంగనాయకసాగర్‌ను నింపి సాగునీళ్లు ఇవ్వాలంటున్న కర్షకులు

సిద్దిపేట, జూలై 31:సాగునీటి కోసం రైతులకు కష్టాలు తప్పడం లేదు. అనుకున్నంతగా వర్షాలు పడక భూగర్భజలాలు పెరగడం లేదు. గతంలో సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్ ద్వారా పచ్చని పంట పొలాలుగా మారిన భూములన్నీ నేడు బీడుగా కనిపిస్తున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రంగనాయకసాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా నంగునూరు, సిద్దిపేట అర్బన్ మండలాల్లోని గ్రామాల్లో చెరువులు నింపారు. కుడికాలువ ద్వారా చిన్నకోడూరు, సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లోని రైతులకు సాగునీటిని అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మేడిగడ్డపై లేనిపోని ఆరోపణలు చేసి ప్రాజెక్టులను గోదావరి జలాలతో నింపలేదు. దీంతో రైతులు వర్షం కోసం మొగులుకు ముఖం పెట్టే రోజులు వచ్చాయి. ఇటీవల కురిసిన వర్షాలతో కొంతమేర సాగు చేసినప్పటికీ కాళేశ్వరం ద్వారా రంగనాయకసాగర్ నింపి తద్వారా చెరువులు, కుంటలు నింపి సాగునీరు అందిస్తేనే వ్యవసాయం ముందుకు సాగుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

# నాడు జలకళ..నేడు వెలవెల

- ఎడారిగా మారిన కూడవెల్లి... ఎండిపోయిన కాల్వలు
- సాగునీటి కోసం అన్నదాతల ఇక్కట్లు

## మల్లన్నసాగర్ జలాల కోసం రైతుల ఎదురుచూపు

దుబ్బాక, జూలై 31: ఓ పక్క వర్షాభావం..మరో పక్క కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల దుబ్బాక నియోజకవర్గ రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. కేసీఆర్ సర్కారులో కాళేశ్వరం నుంచి మల్లన్నసాగర్ కాల్వల ద్వారా దుబ్బాక నియోజకవర్గాన్ని ముద్దాడిన గోదావరి జలాలు నేడు కనిపించడం లేదు. బీఆర్‌ఎస్ సర్కారులో రెండేండ్లుగా మల్లన్నసాగర్ ద్వారా కూడవెల్లికి నీరు విడుదల చేయడంతో నియోజకవర్గంలోని రైతులు సంతోషంగా రెండు పంటలు పండించుకున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో మల్లన్నసాగర్ నుంచి నీరు విడుదల చేయక రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ఎడారిగా కూడవెల్లి**

మల్లన్నసాగర్ ప్రాజెక్టు ద్వారా 54 కి.మీటర్ల పొడవుతో ఉన్న కూడవెల్లివాగు జీవనదిగా మారింది. దీంతో పాటు మల్లన్నసాగర్ 12వ ప్యాకేజీ ప్రధాన కాల్వ నుంచి ప్యాకేజీ (దుబ్బాక కెనాల్) ద్వారా దుబ్బాక, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల (ముస్తాబాద్) నియోజకవర్గాల్లోని చెరువులు, కుంటలకు నీరు సరఫరా చేశారు. దుబ్బాక నియోజకవర్గంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల ద్వారా మొత్తం 1.27 లక్షల ఎకరాలకు సాగునీరు అందించారు. రెండేండ్లుగా వానకాలం, యాసంగి పంటలకు సాగునీరు సమృద్ధిగా ఉండేది. మల్లన్న సాగర్ ప్రధాన కాల్వను ఐదు విభాగాలుగా (చిన్న కాల్వలను) విభజించి, 46 కి.మీ పొడవుతో నిర్మించారు. గొలుసు కాల్వల ద్వారా 93 చెరువులు, కుంటలను నింపడంతోపాటు 1.27 లక్షల ఎకరాలకు సాగునీరు అందించారు. తొగుట మండలం ఎల్లారెడ్డిపేట నుంచి బంజేరుపల్లి, మెట్టు, ఘనపూర్, వెంకట్రావ్‌పేట గ్రామాల నుంచి సిద్దిపేట నియోజకవర్గంలో ఇర్కోడు, తోర్నాల నుంచి దుబ్బాక మండలంలో తిమ్మాపూర్, అప్పనపల్లి, హస్‌మీరాపూర్, పెద్దగుండవెల్లి, బల్వంతాపూర్, పద్మశాలిగడ్డ, చెల్లాపూర్, రాజక్కపేట గ్రామాల నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం మద్దికుంట, చిప్పలపల్లి, గోపాలపూరం గ్రామాల మీదుగా చివరకు మిడ్ మానేరుకు నీరు సరఫరా అయ్యేది. మల్లన్నసాగర్ ద్వారా నియోజకవర్గంలో పలు కాల్వల ద్వారా తొగుట, మిరుదొడ్డి, దుబ్బాక మండలాల్లో 66, 423 ఎకరాలకు సాగు నీరు అందేది. మరో పక్క దౌల్తాబాద్, రాయపోల్, చేగుంట మండలాలకు కొండపోచమ్మసాగర్ నుంచి గజ్వేల్ మీదుగా ప్రధాన కాల్వ ద్వారా మరో 60 వేల ఎకరాలకు పైపులైన్ ఏర్పాటు చేశారు. గత యాసంగిలో కూడవెల్లికి సాగునీరు సరఫరా చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పలుమార్లు సంబంధిత మంత్రి, సీఎంకు విన్నవించినా పట్టించుకోలేదు. సాగునీటి కోసం రైతులతో కలిసి ఆందోళన చేయడంతో కూడవెల్లికి నీరు విడుదల చేశారు. అప్పటికే చాలామేరకు పంటలు ఎండిపోయాయి. ఇప్పుడు వర్షాభావం కారణంగా వరినాటు వేయక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క కాళేశ్వరం జలాలను మల్లన్నసాగర్‌కు విడుదల చేయకపోవడంతో సమస్యగా మారింది. గత వానకాలంలో ఎటు చూసినా పచ్చని పంటలతో సస్యశ్యామలంగా ఉండేది. ప్రస్తుతం సాగునీరు లేక బీడుబారిన భూములతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. నీరు లేక నియోజకవర్గంలో సగానికంటే తక్కువగా పంట సాగు విస్తీర్ణం తగ్గింది.



సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో అక్బర్‌పేట–భూంపల్లి వద్ద నీరులేక వట్టిపోయిన కూడవెల్లి వాగు

### నీళ్లు విడుదల చేయాలి



దుబ్బాక, జూలై 31: కేసీఆర్ సర్కారులో మల్లన్నసాగర్ నుంచి పెద్దగుండవెల్లికి సాగునీరు వదిలారు. పంటలకు కావాల్సిన నీళ్లు రావడంతో చాలా సంతోష పడ్డాం. ఇప్పుడు కాల్వల నుంచి సాగునీరు వదలక పంటసాగు చేయలేదు. వానలు లేవు, కాల్వల్లో నీళ్లు రావడం లేదు. నీళ్లు లేక ఆరు ఎకరాలు బీడుగా మారింది. సాగునీళ్లు లేక మా గ్రామంలో 25శాతం కూడా పంటసాగు చేయడం లేదు. రైతులపై రాజకీయం చేయడం సరైంది కాదు. ఇప్పటికైనా కాల్వల ద్వారా నీళ్లు విడుదల చేయాలి.

- గుండాల ప్రకాశ్, రైతు, పెద్దగుండవెల్లి, సిద్దిపేట జిల్లా

### నీళ్లు లేక సాగు చేయడం లేదు



దుబ్బాక, జూలై 31: కేసీఆర్ సర్కారులోనే మల్లన్నసాగర్ ద్వారా సాగు నీళ్లు వచ్చాయి. గత రెండేండ్లు మంచిగా పంటలు పండించుకున్నాం. ఇప్పుడు నీళ్లు లేక పంటసాగు చేయడం లేదు. వానలు పడక కాలం కావడం లేదు. ఇప్పటికే వరినాట్లు పడాల్సి ఉండేది. ఆగస్టు రెండో వారం దాటితే వరి నాట్లు వేసినా పంట చేతికి రాదు. నాకున్న మూడు ఎకరాల్లో ఎకరం వరి పంట సాగు చేయాలనుకున్నా. వరి నారు ముదిరిపోయింది. పంట పెట్టుబడి నష్టపోయా. మల్లన్నసాగర్ కాల్వల ద్వారా చెరువులకు నీళ్లు వదిలి ఉంటే ఈ సమస్య ఉండేది కాదు.

- బిర్ల మల్లయ్య, రైతు, పెద్దగుండవెల్లి, సిద్దిపేట జిల్లా

### కేసీఆర్ సర్కారులోనే మేలు జరిగింది



దుబ్బాక, జూలై 31: మల్లన్నసాగర్ కాల్వల ద్వారా నీళ్లు వదలక పంటలు సాగు చేయలేదు. నాకు ఉన్న మూడు ఎకరాలు బీడుగా మారింది. వానలు లేక భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో మరింత సమస్యగా మారింది. దుక్కులు దున్ని వదిలివేయడంతో కలుపు మొక్కలు పెరిగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులు పెట్టడం మంచిది కాదు. మల్లన్నసాగర్ నీళ్ల కోసం పోరాటానికి సిద్ధంగా ఉన్నాం. కేసీఆర్ సర్కారులోనే రైతులకు మేలు జరిగింది. మల్లన్నసాగర్ కాల్వల ద్వారా చెరువులకు నీళ్లు వదిలి ఉంటే బాగుండేది. బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో రైతులందరూ సంతోషంగా ఎవుసం చేసుకున్నరు.

- గంట పెద్ద రవి, రైతు, పెద్దగుండవెల్లి, సిద్దిపేట జిల్లా

## సింగూరు నీళ్లు హైదరాబాద్‌కేనా..?

**శాసనమండలిలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి**

మెదక్, జూలై 31(నమస్తే తెలంగాణ): వర్షాలు సమృద్ధిగా కురిస్తే మెదక్ జిల్లా సింగూరు నుంచి ఘనపూర్ ఆనకట్టకు నీరు చేరి ఆనకట్ట కింద ఉన్న భూములు సస్యశ్యామలమవుతాయని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయ న శాసనమండలిలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ సింగూరు ప్రాజెక్టు నుంచి ఘనపూర్ ప్రాజెక్టుకు నీటిని వదిలితే ఉమ్మడి మెదక్ జిల్లా ప్రాంతంలోని రైతులు పంటలు పండించుకునేవారని సభ దృష్టికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగూరు నీటి ని ఇరిగేషన్ శాఖ అధికారులు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్‌కు లింకు కలుపుతూ నీటిని హైదరాబాద్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. గత కాంగ్రెస్, టీడీపీ పాలనలో కూడా సింగూరు నీళ్లు హైదరాబాద్‌కు పరిమితమయ్యాయని గుర్తు చేశా రు. ఈ మధ్యకాలంలో వర్షాలు బాగా కురవడంతో రైతులు వరి నాట్లు వేసుకున్నారని, ఇప్పుడు సింగూరు ప్రాజెక్టు నుంచి నీటిని లిఫ్ట్ చేయకపోతే పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురిస్తుందని సభలో ప్రశ్నించారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో సింగూరు నీటిని ఘనపూర్ ప్రాజెక్టుకు లిఫ్ట్ చేయడంతో పంటలు సంమృద్ధిగా పండాయన్నారు. ఇప్పుడు కూడా ఘనపూర్ ప్రాజెక్టులోకి నీళ్లు వదిలేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల విషయంలో కూడా రూ.60వేల కంటే ఎక్కువగా ఇవ్వడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. నిరుపేదలు ప్రైవేట్ దవాఖానల్లో లక్షలు ఖర్చు చేసుకొని వైద్యం చేయించుకుంటున్నారని, వారి బాధలను దృష్టిలో పెట్టుకొని సీఎంఆర్‌ఎఫ్‌ను విడుదల చేయాలని సూచించారు.





అవార్డు కైవసం చేసుకున్న సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్

## సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్‌కు ఉత్తమ అవార్డు

సిద్దిపేట టౌన్, జూలై 31: సిద్దిపేట పాత బస్టాండ్‌ను మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు రాష్ట్రానికి ఆదర్శంగా నిర్మించి ప్రజలకు అంకితం చేశారు. ప్రజా రవాణా ఆర్టీసీ ఉమ్మడి మెదక్ రీజియన్ పరిధిలోని బస్టాండ్ల వసతులు తదితర అంశాలను ప్రామాణికంగా తీసుకున్నది. మెదక్ ఆర్టీసీ రీజియన్‌లో అన్ని బస్టాండ్ల కెల్లా సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు ఉత్తమ అవార్డుతోపాటు రూ.5 వేల నగదును ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డికి సంస్థ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ పురుషోత్తంనాయక్ బుధవారం అందజేశారు.అవార్డు రూపంలో వచ్చిన నగదును ఆర్టీసీ కార్మికుల సంక్షేమ కోసం వినియోగిస్తామని మేనేజర్ సుఖేందర్‌రెడ్డి స్పష్టం చేశారు.

## నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల వారోత్సవాలపై మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 31: జిల్లాలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఆగస్టు 1 నుంచి 7వరకు నిర్వహించనున్నట్లు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో సీడీపీవోలు, వైద్యశాఖ అధికారులతో తల్లిపాలవారోత్సవాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతరాలను తొలిగించి తల్లి ప్రాముఖ్యతను చాటుదామని పిలుపునిచ్చారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్ పరిధిలో సబ్ సెంటర్స్, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా, ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ కార్యాలయం, డీఆర్డీఏ, మెప్మా, ఆరోగ్యశాఖ సిబ్బంది, పత్రికలు, డిజిటల్, సోషల్ మీడియా సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. దవాఖానల్లో 100శాతం ప్రసవాలు జరిపించాలన్నారు. ముర్రుపాలు పట్టించే విధానంపై 58శాతం మందికి మాత్రమే అవగాహన ఉన్నదన్నారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రి, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి లలితకుమారి, డీఈవో వెంకటేశ్వర్లు, సీడీపీవోలు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యంతో నష్టపోతున్న రైతులు

**బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు**



సంగారెడ్డి జిల్లా హద్నూర్‌లో బుధవారం రైతులతో కిక్కిరిపోయిన కెనరాబ్యాంకు

న్యాల్‌కల్, జూలై 31: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడం లేదనే చందంగా మారింది రైతుల పరిస్థితి. అసెంబ్లీ ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ. రెండు లక్షల పంటరుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చాడు. అందులో భాగంగా రెండు విడతల్లో ప్రభుత్వం రూ. లక్ష, లక్షన్నరలోపు రుణాలను మాఫీ చేసింది. ఇందులో చాలా మంది రైతులు అర్హులుగా ఉన్నా బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలు మాఫీ కాలేదు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండల రైతులు న్యాల్‌కల్, చాల్కి, హద్నూర్, కోత్తుర్ గ్రామాల్లోని బ్యాంకు అధికారులు, సంబంధిత మండల వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. న్యాల్‌కల్, హద్నూర్ గ్రామాల్లోని వ్యవసాయ సహకార సంఘాలకు సంబంధించిన బ్యాంకుల్లో వడ్డీతో సహా రైతుల రుణాలు మాఫీ అయ్యాయి. కానీ హద్నూర్, కొత్తూర్ గ్రామాల్లోని కెనరా బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్ల చాలా మంది రైతులు నష్టపోతున్నారు. ఆయా బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు సంబంధిం చి వడ్డీతో సహా కలిపి ప్రభుత్వానికి లెక్కలు పంపకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. చాలామంది రైతుల కొత్త రుణాల ఖాతా నంబర్లు కాకుండా పాత ఖాతా నంబర్లు పంపించడంతో మాఫీ అయిన డబ్బులు వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో రైతులు లబోదిబో అంటున్నారు.

### మాఫీ డబ్బులు వెనక్కి



కెనరా బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్ల మాఫీ అయిన డబ్బులు వెనక్కిపోయాయి. బ్యాంకులో రూ.75 వేల పంట రుణం తీసుకున్నా. వడ్డీతో సహా రూ.1.20 లక్షల వరకు బ్యాంకులో అప్పు ఉన్నది. తీసుకున్న అప్పుకు వడ్డీతో సహా చెల్లించి తిరిగి రెన్యువల్ చేసుకున్నా. రూ. లక్షలోపు పంటరుణమాఫీ జాబితాలో పేరు వచ్చింది. బ్యాంకుకు వెళ్లి చూస్తే డబ్బులు రాలేదని అధికారులు చెప్పారు. సంబంధిత వ్యవసాయాధికారులను సంప్రదించా. ఆధార్ నంబర్‌తో స్టేటస్ పరిశీలిస్తే రూ.75 వేలు పంట రుణమాఫీ అయింది. బ్యాంకు ఖాతా తొలిగించడంతో డబ్బులు వెనక్కివెళ్లిపోయాయని చెప్పారు. బ్యాంకులో తీసుకున్న రుణానికి వడ్డీతో సహా డబ్బులు చెల్లిస్తే అధికారులు మాత్రం రూ.75 వేలు తీసుకున్నట్లు ప్రభుత్వానికి లెక్కలు పంపడం దారుణం.

- అవుటి అంజన్న, రైతు, హద్నూర్, న్యాల్‌కల్ మండలం, సంగారెడ్డి జిల్లా